పత్రికా ప్రకటన - 1

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేది: 30.07.2014

పాలమూరు ఎత్తిపోతల పథకం, జూరాల - పాకాల ప్రాజెక్టు పనులకు సంబంధించిన సర్వే నిర్వహించి డిపిఆర్ సమర్పించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఏజెన్సీలను ఆదేశించారు. దీనికి సంబంధించి బుధవారం ఉత్తరువులు వెలువడ్డాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిచ్చే ప్రాజెక్టులలో ఈ రెండు ప్రాజెక్టులు ముందు వరసలో వుంటాయని ఇదివరకే సిఎం ప్రకటించారు. ఈ నేపథ్యంలో బుధవారం నీటి పారుదల శాఖ మంత్రి టి.హరీష్ రావు, ప్రభుత్వ సలహాదారు విద్యాసాగర్ రావు, నీటి పారుదల శాఖ కార్యదర్శి అరవింద్ రెడ్డి తదితరులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ రెండు ప్రాజెక్టులను చాలా వేగంగా పూర్తి చేయాలని, సెప్టెంబర్‌లో ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో నిధులు కూడా మంజూరు చేయాలని కేసిఆర్ నిర్ణయించారు. పాలమూరు ఎత్తిపోతల పథకానికి రూ. 5.73 కోట్లు, జూరాల - పాకాల ప్రాజెక్టుకు రూ.3.03 కోట్లు సర్వే, డిపిఆర్‌ల కోసం విడుదల చేశారు. పాలమూరు సర్వే పనులను ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజికి, జూరాల - పాకాల పనులను వ్యాప్‌కో కు అప్పగించారు. సర్వే నిర్వహించి నివేదిక సమర్పించేందు కోసం రెండు నెలల గడువు ఇచ్చారు.

జూరాల వరద నీటిని మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు తరలించేందుకు పాలమూరు ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేశారు. జూరాల నుంచి 70 టిఎంసిల నీటిని షాద్‌నగర్ మండలం లక్ష్మిదేవిపల్లి లోని ఎత్తైన ప్రాంతానికి ఎత్తిపోసి అక్కడి నుండి భూమ్యాకర్షణ శక్తి ద్వారా క్రింది ప్రాంతాలకు తరలించాలనేది, మధ్యలో మహబూబ్‌నగర్-నల్గొండ జిల్లాల మధ్య వున్న మిడ్ డిండి రిజర్వాయర్‌ను కూడా కలుపుకోవాలన్నది ఈ పథకం లక్ష్యం. మహబూబ్‌నగర్ జిల్లాలో 7 లక్షల ఎకరాలు, రంగారెడ్డి జిల్లాలో 2.70 లక్షల ఎకరాలు, నల్గొండలో 30 వేల ఎకరాలకు నీరు అందించవచ్చనేది ప్రాథమిక అంచనా. ఈపథకాన్ని

మరి ంత విస్తరించి హైదరాబాద్ తాగునీటి అవసరాలు కూడా తీర్చాలని ప్రభుత్వం ఉద్దేశ్యం.

మహబూబ్‌నగర్ జిల్లా జూరాల నుండి వరంగల్ జిల్లా పాకాల వరకు దాదాపు 400 చెరువులను నింపుతూ మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో చెరువుల కింద సాగవుతున్న భూమిని స్థిరీకరించేందుకు జూరాల- పాకాల ప్రాజెక్టును నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. జూరాల నుండి 60 నుండి 70 టిఎంసిల నీటిని గ్రావిటీ ద్వారా పాకాల దాకా తీసుకువచ్చేందుకు ఈ పథకానికి రూపకల్పన చేశారు. దాదాపు 400 కిలోమీటర్ల మేర నీటి ప్రవాహం వుండేందుకు గొలుసుకట్టు చెరువులను ఆధారం చేసుకొని ఈ ప్రాజెక్టు పని చేస్తుంది.

---

సిపిఆర్ఓ టు సిఎం.